కర్నూలు | నంద్యాల
వార్త
8 జనవరి 2026 గురువారం పేజీలు 4

విద్యార్థులను మీ సొంత పిల్లల్లా చూసుకోవాలి : ఏపి ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి

- మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏపి ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి..

వెల్దుర్తి, జనవరి7, ప్రభాతవార్త : విద్యార్థులను మీ సొంత పిల్లల్లా చూసుకోవాలని ఏపి ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలకు సూచించారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లాపరిషత్ బాలుర, బాలికల, మహాత్మజ్యోతిబాపూలే, కెజిబివి పాఠశాలలను ఏపి ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి సంబంధిత అధికారులతో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. బాలికల ఉన్నతపాఠశాలలో కోడిగ్రుడ్లు రికార్డుల ప్రకారం ఉన్నదాని కంటే తక్కువగా ఉండడం, బాలుర ఉన్నతపాఠశాలలో ఎక్కువగా ఉండడంపై ఆయన హెచ్ఎంలను ప్రశ్నించారు. విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలని ప్రభుత్వం లక్షలాది రుపాయలు ఖర్చు చేస్తుంటే ఇలా చేయడం ఏమిటన్నారు. అదేవిధంగా మహాత్మజ్యోతిబాపూలే బిసి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసి రికార్డులు అస్తవ్యస్తంగా ఉండడం, మెనూ పాటించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కందిబ్యాళ్లు వేసి చేయాల్సిన సాంబార్‌ను చనగబ్యాళ్లు వేసి చేయడం ఏమిటని ప్రశ్నించారు. మీ పిల్లలకు ఇలాగే వండి పెడతారా అని ఆయన ఆగ్రహించారు. అనంతరం కెజిబివి పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్నభోజనాన్ని రుచి చూశారు. మెనూ పాటించడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడంపై ఆయన సంతృప్తి వ్యక్త ం చేశారు. ఈ సందర్భంగా ఏపి ఫుడ్ కమీషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ తన తనిఖీలో వెలుగు చూసిన విషయాలను రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో

ఆయనతో పాటు జిసిడిఓ మేరి స్నేహాలత, బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలహెచ్ఎంలు రామనాయక్, చంద్రావతి, జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ షబానాబేగం, కెజిబివి ప్రిన్సిపాల్ షాకీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్‌ను.. ఢీకొట్టిన ఆటో..!

- ప్రమాదంలో ఇద్దరు మృతి... మరొకరికి గాయాలు
- ఎరిగేరి-కౌతాళం రహదారిలో ప్రమాదం



కౌతాళం రూరల్, జనవరి 07, ప్రభాతవార్త: మండలంలోని ఎరిగేరి-కౌతాళం రహదారిలోని ఎల్ఎల్‌సీ కాలువ సమీపంలో బుధవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరొకరికి గాయాలపాల య్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆటో డ్రైవర్ శేఖర్ ఆటోలో మద్యం బాటిళ్లను లోడు చేసుకుని ఎరిగేరి వైపు వస్తుండగా ఎరిగేరి-కౌతాళం వద్ద తల్లి మహాదేవి, కుమారుడు నాగిరెడ్డి, మనవడు అభిలు ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి మహాదేవి, కుమారుడు నాగిరెడ్డి ప్రమాద స్థలంలోనే మృతిచెందారు. అభి గాయాలతో బయటపడ్డాడు. ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఆటో నడుపుతున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. కౌతాళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కౌతాళం పోలీసులు తెలిపారు. తల్లి, కుమారుడు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదాల నివారణకు.. పటిష్ట చర్యలు తీసుకోవాలి

నంద్యాల జనవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి : జిల్లాలో జాతీయ రహదారులపై జరుగుతున్న రహదారి ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. పోలీసు అధికారులు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో వెంటనే స్పీడ్ బ్రేకర్లు, రహదారి సూచిక బోర్డులు, స్పీడ్ గన్స్, పవర్‌ఫుల్ బ్లింకర్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం (జనవరి 1 నుండి 31 వరకు)లో భాగంగా జిల్లా రహదారి భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఆర్ బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, ఏఎస్పీ మంద జవాలి అల్పోన్స్, డీటీసీ శివారెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామంజీ నాయక్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 40, 44, 340సి, 167కే రహదారులపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా పోలీసు శాఖ గుర్తించిన యాక్సిడెంట్ జోన్లలో తక్షణ భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలైన అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి అంశాలపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్‌హెచ్40లోని సోమయాజులపల్లె, ఆళ్లగడ్డ, చాబోలు జంక్షన్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు

జరుగుతున్నాయని, అక్కడ సరైన సర్వీస్ రోడ్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తమ్మరాజుపల్లె ప్రాంతం ప్రమాదాల కేంద్రంగా మారినందున అక్కడ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్340సి మండ్లెం నుంచి ఆత్మకూరు వరకు రహదారి నిర్మాణం పూర్తైనప్పటికీ, అండర్‌పాసులు, సర్వీస్ రోడ్లు లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గోడౌన్లకు వెళ్లేందుకు ఎక్కువ దూరం తిరగాల్సి వస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి రెండు కిలోమీటర్లకు ఏర్పాటు చేసిన క్సులు అత్యవసర సమయాల్లో టోల్ ప్లాజా ఎమర్జెన్సీ సిబ్బందికి సమాచారం అందించడంలో కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. తగిన విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వెంటనే రహదారి లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా లో సర్వీస్ రోడ్లు, విద్యుత్ సరఫరా, పచ్చదనం అభివృద్ధి చేయాలని సూచించారు. రానున్న మహాశివరాత్రి పర్వదినం దృష్ట్యా శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో రోడ్డు మిర్రర్లు, స్పీడ్ బంప్స్ ఏర్పాటు చేసి భద్రతను మరింత పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యార్థి బస్సుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఆయా బస్సుల్లో కేవలం విద్యార్థులే ప్రయాణించే విధంగా పర్యవేక్షణ పెంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గత గణాంకాలను ప్రస్తావిస్తూ, 2024 సంవత్సరంలో 542 ప్రమాదాలు జరిగి 271 మంది మృతి చెందగా, 2025 సంవత్సరంలో 567 ప్రమాదాలు జరిగి 296 మంది మృతి చెందినట్లు తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని 2026లో ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు కఠిన చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

అటవీశాఖ అధికారి.. ఎక్కడ..!?

- వన్యప్రాణుల సంరక్షణను పట్టించుకోరా..!
- విధులకు డుమ్మా..
- మృతి చెందిన జింక మాయం

ప్యాపిలి జనవరి7 ప్రభాతవార్త: వన్యప్రాణులను సంరక్షించాల్సిన అటవీశాఖ అధికారి అడ్రస్ కనిపించడం లేదు. రోడ్డుపైకి వచ్చిన జింకను బైక్ ఢీకొనడంతో మృతి చెందింది. వెంగళాంపల్లె గ్రామ ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. జింక మృతి చెందిన విషయాన్ని ఫారెస్ట్ అధికారికి సమాచారం అందించి మృతదేహాన్ని తీసుకుని వెళ్లాలని కోరారు. అయితే అటవీశాఖ అధికారి తాను పంపే వ్యక్తికి జింక మృతదేహాన్ని ఇచ్చి పంపాలని చెప్పడంతో పోలీసులు వచ్చిన వ్యక్తికి ఇచ్చి పంపించారు. జింకను తీసుకొని వెళ్ళిన వ్యక్తి ఫారెస్ట్ అధికారికి ఇచ్చారా లేదా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదం జరిగి నెలరోజులు గడిచినప్పటికీ జింకకు మాత్రం పోస్టుమార్టం కాలేదని తెలిసింది. ఫారెస్ట్ అధికారి విధులకు రాకుండ నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఫారెస్ట్ అధికారి వన్నె జీవాలను కాపాడాల్సిన అధికారి నిర్లక్ష్యంగా పట్టి పట్టినట్లు వ్యవహరిస్తున్నారని చెపుతున్నారు. అటవీశాఖ అధికారి ఎక్కడ ఉన్నారని, వన్యప్రాణుల సంరక్షణను అధికారి పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. మృతి చెందిన జింక ఏమైనట్లు అన్న సందేహాలను ప్రజలు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక మాయం మిస్టరీని చేయించాలని ప్రజలు కోరారు..

ప్రత్యేక తరగతుల పై.. డీఈఓ ఆకస్మిక తనిఖీ

బనగానపల్లె జనవరి 7 ప్రభాతవార్త: జిల్లా విద్యాశాఖధికారి జనార్దన్ రెడ్డి బుధవారం నందవరం జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8గంటలకే పాఠశాలకు చేరుకొని పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి బోధన-అభ్యాస విధానాలను గమనించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశం సమయంలో విద్యార్థులను ఉద్దేశించి డీఈవో మాటాడుతూ మీరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులనే గర్వంగా చెప్పుకోగల స్థాయికి ఎదగాలి. మీలో ఉన్న ప్రతిభను మీరు తక్కువ అంచనా వేయకండి అని విద్యార్థులకు ప్రేరణ కలిగించారు.

రోజుకు ఒక్క గంట క్రమశిక్షణతో చదివినా, భవిష్యత్తు మారుతుంది. మీ విజయంలో ఉపాధ్యాయులు మార్గదర్శకులు మాత్రమే, నిజమైన శ్రమ మీరు చేయాలి" అని విద్యార్థులను ఉత్సాహపరిచారు. పరీక్షలు మీకు భయంకరమైనవి కావు, మీకు తెలిసిన విషయాలను చెప్పే అవకాశం మాత్రమే" అని ధైర్యం చెప్పారు. కంప్యూటర్ ల్యాబ్ ప్రాముఖ్యతను వివరిస్తూ, "టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటే గ్రామీణ విద్యార్థులకూ ప్రపంచం తెరవబడుతుంది" అని తెలిపారు. ప్రతి రోజు ఒక లక్ష్యంతో పాఠశాలకు రావాలి. ఆలస్యం, నిర్లక్ష్యం మీ శత్రువులు" అని హెచ్చరించారు. డీ ఇ ఓ ప్రత్యేక తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ

కర్నూలు జనవరి 07 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ పై నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.. స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిధి అధ్యక్షతన సాగిన ఈ సమావేశానికి కమిటీ సభ్యుడిగా ఉన్న ఎంపీ నాగరాజు హాజర

య్యారు. సమావేశంలో భాగంగా తమిళనాడు రాష్ట్రానికి సంబంధించి ఆహార ధాన్యాల రవాణా, రైల్వేల ద్వారా రవాణాను ఆప్టిమైజ్ చేయడం అనే అంశం పై చర్చించారు...ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన మేనేజింగ్ డైరెక్టర్, సదరన్ రైల్వేస్ జనరల్ మేనేజర్ మరియు తమిళ నాడు ప్రభుత్వ కార్యదర్శులు పాల్గొన్నారు

చివరి ఆయకట్టు వరకు..
సాగునీటిని అందిస్తున్నాం

- రైతుల సంక్షేమానికి కూటమి ప్రభత్వం కట్టుబడి ఉంది
- ప్రాజెక్టులను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- వైకాపా నేతలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గౌరుచరితారెడ్డి ఫైర్

నంద్యాల, జనవరి 7, ప్రభాతవార్త ప్రతినిధిః రాజకీయ ప్రయోజనాల కోసం వైకాపా నేతలు అడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని కమిషన్ల కోసం ప్రాజెక్టుల నిర్మాణాలు గాలికోదిలేసిన వారికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని రా ష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో శ్రీశైలం, నందికోట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖం రెడ్డి, గిత్తా జయసూర్యలతో కలిసి వారు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హాయంలో ఇసుక, మట్టి, మద్యం మాఫీయాలపై ఉన్న శ్రద్ధ సాగునీటి ప్రాజెక్టులపై లేదని వారు మండిపడ్డారు. వెలుగోడు ప్రాజెక్టు ద్వారా ప్రతి అడుగున తడిపి రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. ఆలగనూరు కరకట్ట మట్టిని సైతం..

• వివరాలు 2లో

రోడ్డు ఎక్కిన..
విద్యార్థులు..!

: బస్సులు సకాలంలో రాకపోవడంతో..నిరసన

ఆదోని క్రైమ్ జనవరి 7 ప్రభాతవార్త : ఆదోని పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ ప్రాంతం మంగళవారం రాత్రి విద్యార్థుల నిరసనతో హోరెత్తింది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు సకాలంలో రాకపోవడంతో, గంటల తరబడి నిరీక్షించిన విద్యార్థినిలు చివరకు విసుగు చెంది రోడ్డుపైనే బైఠాయించారు. పాఠశాల ముగిసిన అనంతరం సాయంత్రం వేళల్లో బస్సులు లేక తాము పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న డీ ఎస్ ఎఫ్ నాయకులు విద్యార్థులకు మద్దతుగా నిలిచారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం తగదని, ప్రతి పల్లెకూ విద్యార్థి బస్సులను ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ నాయకుడు దానపురం ఉదయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నంద్యాల విజయాపాల డేయిరీ వద్ద.. హైటెన్షన్..!

నంద్యాల, జనవరి 7, ప్రభాతవార్త ప్రతినిధిః నంద్యాల విజయ పాల డేయిరీ వద్ద హైటెన్షన్ నెలకొంది. త్రీసభ్య కమిటీ సభ్యుల అరెస్టుకు పోలీసుల మోహరింపు ఉన్నట్లు పేర్కొంటున్నారు. టీడీపీ నేతల ప్రోత్సాహంతోనే త్రీ సభ్య కమిటీ సభ్యులపై చర్యలకు ప్రయత్నమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అరెస్టు అవసరం ఎమొచ్చిందంటూ ప్రశ్ న్నిస్తున్న ప్రతిపక్ష నేతలు, పోలీసులైతే అరెస్టు కాదు బైండోవర్ కోసమే అంటూ వివరణ ఇస్తున్నారు. ఈవ్యవహారమంతా కోర్టు మెట్లు ఎక్కెసూచనలు కనిపిస్తున్నాయి. విజయ పాల డేయిరీ వద్ద చట్టమే ప్రశ్నార్థకం..! త్రీసభ్య కమిటీ అరెస్టుకు టీడీపీ నేతల ఒత్తిళ్లే కారణమంటున్న సబ్యులు బైండోవర్ పేరిట పోలీసుల బెదిరింపులు న్యాయమా..? అని ప్రశ్నిస్తున్న మేధావి వర్గం.

కార్పొరేషన్ ఆదాయానికి గండిపడితే సహించను

– నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్

కర్నూలు మున్సిపల్, జనవరి 7, ప్రభాతవార్తః కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయానికి గండి పడేలా వ్యవహరిస్తే సహించబోమని కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం ఆయన రెవిన్యూ విభాగ సిబ్బందితో మున్సిపల్ దుకాణాల అద్దెలు, పన్నుల వసూలుపై సమీక్ష నిర్వహించారు. టైటిల్ ట్రాన్స్‌ఫర్ పన్ను విధింపు సమయంలో అవకతవకలను ఉపేక్షించబోమని, మున్సిపల్ షాపుల గుడ్‌విల్, అద్దె వసూళ్ళల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నేర ప్రవృత్తిపై సమీక్ష సమావేశం

కర్నూలు హాన్పటల్ జనవరి 7 ప్రభాతవార్త : ఈరోజు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జిల్లా నేర ప్రవృత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు జిల్లాల అధికారులు, సంబంధిత సీఐలు హాజరయ్యారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలన, ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమాల అమలు, అక్రమ మద్యం నియంత్రణ, అనధికార మద్యం నిర్మూలనపై ప్రత్యేకంగా చర్చించారు. పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా వస్తున్న మద్యంపై నిఘా

పెంచి పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. సురక్ష యాప్ ద్వారా స్కానింగ్, ఎక్సైజ్ యాప్ ద్వారా పర్యవేక్షణ తప్పనిసరిగా చేయాలని సూచించారు. అలాగే అన్ని మద్యం షాపులకు పరిమిట్ రూముల లైసెన్సులు, ఆర్ ఈ టిసక్రమంగా చెల్లించారా లేదా అనే అంశాలపై పర్యవేక్షణ చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. హనుమంతరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. రాముడు, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్ గౌడ్‌తో పాటు ఆయా స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన పంచతత్త్వ మెగా వైజ్ఞానిక ప్రదర్శన

కర్నూలు విద్య, జనవరి 7, ప్రభాతవార్తః మాంటిస్సోరి విద్యాసంస్థల స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పంచతత్త్వ – మెగా సైన్స్ ఎక్స్‌పో ఘనంగా ప్రారంభమయింది. వేడుకలకు విశిష్ట అతిథిగా వ్యవస్తాపక చైర్మన్ సైయెంట్ లిమిటెడ్ చైర్మన్ పద్మశ్రీ డా.బి వి ఆర్ మోహన్‌రెడ్డి. ముఖ్య అతిథులుగా ప్రొ.పి చంద్రశేఖర్, డా.ప్రవీణ్ జంబోల్కర్, మాంటిస్సోరి పూర్వ విద్యార్థి మధు నారాయణలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పంచతత్త్వ అనగా ఆకాశం, భూమి, జలం, అగ్ని వాయువు ముఖ్య అంశాలుగా ప్రారంభమయి ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నభూతో న భవిష్యతి అన్న విధంగా అపతిహతంగా 8, 9 తేదిల్లో కొనసాగనున్నాయి. ఈవిద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న శిశేషాంశాలు టోర్నడో కాన్సెప్ట్, రోబో పియానో, వాటర్ రోబో, డి సి హ్యాండ్ క్రాంక్, జనరేటర్, ఫ్యూచర్ వైర్ లెస్ సిటి, డ్రోన్ టెక్నాలజీ సాటిలైట్ కమ్యూనికేషన్, మంగయాన్ ఏవియేషన్ జెనసిస్, లైఫ్ అన్ స్పేస్, ఏఐ కాస్ట్యూమ్ ఫోటో బూత్ మొదలైన ప్రధాన అంశాలు వీక్షకులను సైన్స్ అరాధకులను అమితంగా అకట్టుకుంటున్నాయి. వీటితో పాటు మ్యాజిక్ ప్రధాన అకర్షణగా పిల్లలను అలరిస్తు.. వాస్తవం అవాస్తవాల మధ్య ఆలోచనను కలుగజేసింది.

చివరి ఆయకట్టు వరకు.. సాగునీటిని అందిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి) : వైకాపా హాయాంలో అమ్ముకున్నారని ఆరోపించారు. కరకట్ట ప్రమాదంలో ఉన్న పట్టించుకోకుండా తప్పుడు సమాచారం ఇచ్చారని కూటమి ప్రభుత్వం వచ్చాక తక్షణ మరమ్మత్తులకు కోటీ రూపాయల శాశ్వత పనుల కోసం ఇటీవల మరో రూ.58 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం కేవలం 18 నెలల్లో ప్రాజెక్టుల కోసం రూ.6,600 కోట్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ప్రాజెక్టులపై అవగాహన లేని వైకాపా నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకోబమని హెచ్చరించారు. ప్రాజెక్టుల అభివృద్ధిపై వైకాపా నేతలు చర్చకు సిద్ధామా అని బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కుప్పం వరకు సాగునీరు. అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని వారు స్పష్టం చేశారు. ఈసమావేశంలో నీటి సంఘాల చైర్మన్ రామలింగారెడ్డి, డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ చాబోలు ఇలియాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర , దేశ స్థాయి క్రికెట్‌కు వెళ్లేందుకు గొప్ప అవకాశం..

ఆదోని, డిసెంబర్ 07, ప్రభాతవార్త : ఆదోని క్రికెట్ అసోసియేషన్ ఉప కేంద్రంలో క్రికెట్ సెలక్షన్స్ కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపకేంద్రం అయినటువంటి ఆదోనిలో అండర్ 12 మరియు అండర్ 14 బాలురకు ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గా ల క్రికెట్ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, క్రికెట్ మైదానం లో ఈనె ల11.01.2026 న ఉదయం 8:30 గంటలకు క్రికెట్ సెలక్షన్స్ ఉంటాయని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయబడుతుందని, కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ దేవేంద్ర గౌడ్ ఆదోని క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విట్టా రమేష్ తెలిపారు. అండర్ 12 విభాగంలో పాల్గొనే క్రికెట్ క్రీడాకారులు 1.09.2014 తర్వాత జన్మించి ఉండాలి. అదేవిధంగా అండర్ 14 విభాగంలో పాల్గొనే క్రికెట్ క్రీడాకారులు 1.9.2012 తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ డేట్ అఫ్ బర్త్ సర్టిఫికేట్, ఒరిజినల్ ఆధార్ కార్డు మరియు వ్యక్తిగత క్రికెట్ కిట్, వైట్ అండ్ వైట్ తో హాజరు కావాలని తెలిపారు.

పందిపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

కర్నూలు అర్బన్, జనవరి 7, ప్రభాతవార్త : కల్లూరు మండలంలోని పందిపాడు గ్రామంలో పొలం పిలుస్తుంధ్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డి.ఆర్.సి. ఏ.డి.ఏ. అరుణ కుమారి, డి.ఆర్.సి. ఏ.ఓ. నాగ సరోజమ్మ పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా అమలు చేయాలని, పండ్ల తోటల పెంపకంతో పాటు పోషక ఆహార పంటలైన కొర్ర, సజ్జ వంటి పంటల సాగును పెంచాలని సూచించారు. అలాగే మిశ్రమ పంటలు సాగు చేయడం, పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం వల్ల భూమి సారవంతం పెరుగుతుందని తెలిపారు. కందులు పంటను క్వింటాల్‌కు రూ.8,000/ ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొంటూ, అర్హులైన రైతులు తప్పనిసరిగా రైతు సేవ కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఎ. ఇ. ఓ.) సువర్ణ, గ్రామ పెద్దలు మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ తోడ్పాటునివ్వడం సంతోష దాయకం

కర్నూలు, జనవరి 7, ప్రభాతవార్త : వికసిత్ భారత్ 2047 యొక్క విశాల దృక్పథానికి తోడ్పాటుకు సహకారం అందించేందుకు ముందుకు రావడం సంతోష దాయకంగా ఉందని మార్వాడి విశ్వవిద్యాలయ ప్రోవోస్ట్ ఆర్.బి. జడేజా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యత (లోకల్ ఫర్ లోకల్) నినాదానికి అనుగుణంగా, వి జి ఆర్ సి గుజ రాత్ లోని నాలుగు జోన్లలో నిర్వహించబడుతుందని తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, నెదర్లాండ్స్ వంటి దేశాలతో పాటు జట్రో, ఐసీబీసీ, యు.ఎస్.ఐ.ఎస్.పి.ఎఫ్, ప్రపంచ బ్యాంకు మరియు రష్యన్ పేద దేశం వంటి సంస్థల నుండి భాగస్వామ్యం ఉండనుందని తెలిపారు. ఈనెల 11 12 తేదీల్లో జరగనున్న విజిఆర్సి ఆతిథ్య వేదికగా నిలువనుందని వారు చెప్పారు. గుజరాత్ ప్రభుత్వ విద్యా విభాగానికి 1000 కోట్ల పెట్టుబడి కి సంబంధించిన అవగాహన ఒప్పంద ప్రతిపాదనను సమర్పించిందని తెలిపారు. తద్వారా అత్యాధునిక ప్రయోగశాలలతో కూడిన కొత్త విద్యా భవనాలు, క్రీడా సౌకర్యాలు, నూతన తరం వసతి గృహాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని వివరించారు. విశ్వవిద్యాలయ ట్రస్టీ ధ్రువ్ మార్వాడి మాట్లాడుతూ కచ్ సౌ రాష్ట్ర ప్రాంతం కోసం వైబ్రేట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సులకు ఆతిథ్యం ఇవ్వడం తమకు సంతోషంగా ఉందని తెలిపారు. ఆవిష్కరణలు, పరిశ్రమల భాగ స్వామ్యం, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చే సంస్థగానూ, స్థానిక సంస్థలు, స్టార్టప్ లు, ప్రభుత్వ సంస్థలు, ప్రపంచ పెట్టుబడిదారుల మధ్య సహకారాలను పెంపొందించే వేదికను అందించడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం, సమ్మిళిత వృద్ధి ఇంజన్ గా గుజరాత్ ఆవిర్భావానికి దోహదపడాలనే మా నిబద్ధతకు ప్రతీక అన్నారు.

నేటి నుండి పీజీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు విద్య, జనవరి 7, ప్రభాతవార్తః రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ వి వెంకటబసవరావు అదేశాల మేరకు పీజీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు నేటి నుండి ఫిబ్రవరి 2వ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పరీక్షల డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. విశ్వవిద్యాలయం మరియు 3 పరీక్షా కేంద్రాల్లో (నంద్యాల, ఆదోని, నందికోట్కూరు)లలో జరుగుతున్న ఈపరీక్షలకు పీజీ థర్డ్ సెమిస్టర్ రెగ్యులర్ 487 మంది, సప్లిమెంటరీలో 33 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరవుతున్నారని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అన్‌లైన్ హాల్‌టిక్కెట్‌తో అరగంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

త్వరలో.. నగరపాలక సంస్థ కార్యాలయం తరలింపు

కర్నూలు మున్సిపల్, జనవరి 7, ప్రభాతవార్తః ఎన్ఆర్‌పేటలోని నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంక్రాంతి పండుగ తరువాత వెంకటరమణ కాలనీలోని ఫ్రైడ్ ప్లాజాలోకి తరలించనున్నట్లు కమిషనర్ విశ్వనాధ్ తెలిపారు. బుధవారం ఆయన ఫ్రైడ్ ప్లాజాను పరిశీలించారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం వద్ద నూతన కార్యాలయ పనుల్లో భాగంగా పాత కార్యాలయాన్ని ఫ్రైడ్ ప్లాజాకు తరలించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రూ.85లక్షలతో ప్లంబింగ్, నెట్‌వర్కు, బోర్లు, బాత్‌రూంలు వంటి నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయన్నారు. అంతకుముందు గడియారం అసుపత్రి ఆదునీకరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి నాగరాజు, ఎంఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో ముఖాముఖీ చర్చల్లో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నంద్యాల, జనవరి 7, ప్రభాతవార్త ప్రతినిధిః నంద్యాలలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సంస్థ బుధవారం నిర్వహించిన రైతులు, శాస్త్రవేత్తలు ముఖా ముఖీ చర్చ కార్యాలయంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా.మంజునాథ్, నంద్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు నంద్యాల మరియు బండిఆత్మకూరు వ్యవసాయ అధికారులు, ఆత్మ బిటిఎం, ఏపీఎం ఏఈఓ, విఏఏలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు రైతులకు వరి, మొక్కజొన్న, జొన్న, మినుము, ఆలవాలు, పసుపు, శనగ పంటల్లో నూతన వంగడాలు, పురుగులు తెగుళ్ళ గురించి వివరంగా చర్చించడం జరిగింది. నానో యూరియా డ్రోన్‌తో స్ప్రేయింగ్ దాని ఉపయోగాల గురించి చర్చించారు. నంద్యాల సబ్‌డివిజన్ నుంచి రైతులు పాల్గొన్నారు.

మాతృభాషా పరిరక్షణకు మేనేజర్ కృషి అభినందనీయం

కర్నూలు మున్సిపల్, జనవరి 7, ప్రభాతవార్తః మాతృభాషా పరిరక్షణకు ఎన్ చిన్నరాముడు చేస్తున్న కృషి అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి విశ్వనాధ్ పేర్కొన్నారు. ఆంధ్ర సరస్వత పరిషత్ నిర్వహించిన మూడవ ప్రపపంచ తెలుగు మహాసభల్లో ఆంధ్ర సరస్వత సేవా అవార్డును అందుకున్న మేనేజర్ చిన్నరాముడిని సూపిరియర్ ఎంప్లాయిస్ సభ్యుల్లో తొలిసారి గౌడ్ మూడవ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. కార్యదర్శి నాగరాజులను బుధవారం స్థానిక ఎన్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భనంలో సత్కరించారు. కమిషనర్ విశ్వనాధ్‌తో పాటు డిప్యూటి మేనేజర్ సిద్దారెడ్డి రేణుక ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలుగుభాషా అభివృద్ధి పరిరక్షణకు మేనేజరు చేస్తున్న కృషి ప్రతి ఉద్యోగికి ఆదర్శంగా నిలుస్తాదని తెలిపారు. అంకితభావంతో విధులు నిర్వహించడం వల్లే కార్యదర్శి నాగరాజు ఈస్థాయికి చేరుకోగలిగారని కమిషనర్ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటి కమిషనర్ కుమార్‌రెడ్డి, డీసీపీ వెంకటరమణ, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, వాజిద్, స్వర్ణలత, సూపరింటెండెంట్‌లు రామకృష్ణ, సుబ్బన్న పాల్గొన్నారు.

విద్యారంగానికి మరణశాసనం రాస్తున్న ప్రభుత్వం..!

కర్నూలు విద్య, జనవరి 7, ప్రభాతవార్తః విద్యారంగానికి ప్రభుత్వం మరణశాసనాన్ని రాస్తుందని అల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ పేర్కొంది. జనవరి 5న విజయవాడలో జరిగిన విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సులర్స్ సమావేశంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌లు చాల గంబీరమైన ప్రసంగాలు చేశారు. విశ్వవిద్యాలయాల్లో విద్యాప్రమాణాల పెంపునకు కృషిచేయాలని ఎన్ ఐ ఆర్ ఎఫ్ ర్యాంకుల్లో టాప్ 100లో మన రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉండాలని దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యారంగం అగ్రస్థానంలో నిలవాలని దానికనుగుణంగా విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్దాలని చాల అడంబరమై డాంబిక మాటలు ఎన్నింటినో చెప్పడం జరిగిందన్నారు. వాస్తవపరిస్థితి ఏమిటంటే రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో కనీసస్థాయిలో శాశ్వత ఫ్యాకల్టీ లేకపోవడాన్ని ప్రస్తావించకుండా దాటివేయడం చాల విచారకరమన్నారు. పార్ట్ టైం ఫ్యాకల్టీతో అకడమిక్ కన్సల్ టెంట్స్‌తో నడుస్తున్నాయి. బోధన అభ్యాసన ప్ర క్రియ పూర్తిగా దెబ్బతిని పరిశోధన కుంటుపడి కుప్పకూలిపోయే పరిస్థితి నెలకొందన్నారు. వైస్ చాన్సులర్ నియమకాలు సంకుచిత రాజకీయ ప్రాతిపదికన నియమించడం వల్ల విశ్వవిద్యాలయాలు అనేవి జ్ఞాన సృష్టికి కేంద్రాలుగా కాకుండా స్వార్థరాజకీయ లబ్దిపొందే వేదికలుగా మారుతున్నాయన్నారు. విశ్వవిద్యాలయాల అకడమిక్ స్వేచ్ఛను అటానమిని పరిరక్షించాలని అల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ డిమాండ్ చేస్తోంది. విదేశాల్లో చదివి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి వ్యక్తి నారా లోకేష్ మీ ఆలోచనలు ఆ స్థాయిలో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

రూరల్ సిఐ బివి రమణను కలిసి ఆళ్లగడ్డ జేఏసీ నాయకులు

ఆళ్లగడ్డ, జనవరి 7, ప్రభాతవార్తః ఆళ్లగడ్డ రూరల్ సిఐ బివి రమణను బుధవారం తమ కార్యాలయంలో ఆళ్లగడ్డ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందజేశారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఇంచార్జీ చంద్రశేఖర్, ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన కమిటీ కన్వీనర్ బీరువాల బాషా, నంద్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ చక్రవర్తి, బీసీ సంఘం నాయకులు వెంకటనరసింహా, నంద్యాల జిల్లా రజక సంఘం ఉపాధ్యక్షులు అమదాల రమణ, ఆళ్లగడ్డ రజక సంఘం నాయకులు గురుశంకర్, ఆడ్వకేట్ వలి బాష, బైక్ మెకానిక్ నూర్ బాష, షాషావలి, ప్రభాకర్, వెల్డర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

మహానంది, జనవరి 7, ప్రభాతవార్తః రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని 11 నంబర్లతో కూడి విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గాజులపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉన్న రైతులకు మాత్రమే వ్యవసాయశాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందుతాయని రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రబీలో వేసిన పంటలకు వెంటనే పంట నమోదుచేసుకోవాలని సూచించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని భూసార పరీక్ష ఫలితాల అధారంగా ఎరువులు వాడాలన్నారు. రైతులు పంటలకు అవసరమైన మేరకే యూరియా వాడాలన్నారు. విక్షణారహితంగా ఎరువులు వాడితే పంటను పురుగులు, తెగుళ్లు అధికస్థాయిలో అశించే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, గ్రామ ఉద్యాన అధికారి విశ్వద, రైతులు పాల్గొన్నారు.

రూ.10 వేలు విరాళంగా అందజేసిన పూర్వపు విద్యార్థి

రుద్రవరం, జనవరి 7, ప్రభాతవార్తః మండల పరిధిలోని ఆలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.10 వేలు విరాళంగా పూర్వపు విద్యార్థి ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు సలావుద్దిన్‌కు అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం సలావుద్దిన్ మాట్లాడుతూ ఆలమూరు గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థి ఉప్పు శివ ఆట పరికరాల కొనుగోలు నిమిత్తం బుధవారం రూ.10వేలు పాఠశాలకు విరాళంగా అందజేశారన్నారు. క్రీడల అభివృద్ధి కోసం ఆలమూరు గ్రామ ప్రజలు పూర్వపు విద్యార్థులు అందిస్తున సహకారం అభినందనీయం అన్నారు. ఈవిలువైన విరాళం పాఠశాల క్రీడల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ పాఠశాల తరుపున శివకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక యూరియా వాడటం అనర్థదాయకం

గోనెగండ్ల, జనవరి 7, ప్రభాతవార్త : రైతులు అధిక యూరియా వాడటం వల్ల నేలకు అనర్థదాయకం అని నేల సమతుల్యత దెబ్బతిని చౌడు భూమిగా మరిపోతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి సునీత అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు ఒక్క రోజు యూరియా వడకంపై శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా వనరుల కే ంద్రం వ్యవసాయ ఆధికారిణి సునీత మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియాను వాడటం వల్ల భూములు చౌడు భూములుగా మారి పోతాయని భూమిలో ఉపయోగకరమైన బ్యాక్టిరియా మరియూ శిలిం ద్రాలు నాశనం అవుతాయని తెలిపారు.రైతులు యూరియాను అవసరాలకు సరిపడా మాత్రమే వాడుకోవాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులు ఎమ్మిగనూరులో 1756 టన్నుల,గోనెగండ్లలో 532 టన్నుల, నందవరంలో 286 టన్నులు,మంత్రాలయంలో 342 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. డివిజన్‌లోని నాలుగు మండలాల రైతులకు సరిపడ యూరియా ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఉందని తెలిపారు.ఎమ్మిగనూరు డివిజన్‌లో 10వేల ఎకరాల పైగానే మొక్కజొన్న పంటను సాగు చేశారని అందుకు సరిపడ యూరియా స్టాక్ ఉదన్నారు. యూరియా కావలసిన రైతులకు రైతు సేవా కేంద్రల దగ్గర నుంచి సహకార సంఘాల ద్వార పొందవచ్చునన్నారు.ఇప్ పటి వరకు గోనెగండ్ల మండలంలో 886 టన్నులు,ఎమ్మిగనూరులో 484 టన్నులు,నందవరంలో 178 టన్నులు, మంత్రాలయం మండలంలో 132 టన్నులు రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు.రైతులకు కావాల్సిన యూరియా ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల ద్వార ఇండెంట్ పెట్టి రైతులకు అంద జేయడం జరుగుతుందని తెలిపారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ,ఏవో హేమలత, వ్యవసాయ సిబ్బంది పులిరాజు, ఆరుణ,నిఖిల,షపి గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమావేశం



హొళగుంద, జనవరి 07, ప్రభాతవార్త; మండలకేంద్రమైన హొళగుందలో బుధవారం ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంవీ ఫౌండేషన రాష్ట్ర కో ఆర్డినేటర్ బాస్కర్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ (బాలల హక్కుల పరిరక్షణ కమిటీ) వాళ్లకు పిల్లల హక్కులు, బాల కార్మికులు, బాల్య వివాహాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మండల కమిటీ కన్వీనర్‌గా కెంచెప్ప, కో కన్వీనర్‌గా నాగరకన్వి వెంకటేష్, దేవన్న, మండల కమిటీ గౌరవాధ్యక్షులుగా హనుమంతరాయుడు, రవిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి యువకులు, పెద్దలు, ఎంవీ ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ నాయక్, ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల ఆదర్శప్రాథమికపాఠశాలను తనిఖీ చేసిన మండల విద్యాశాఖాధికారులు

పగిడ్యాల, జనవరి 7, ప్రభాతవార్త : పగిడ్యాల ఆదర్శ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖాధికారులు పి.సుభాన్, యర్రం మురళీమోహన్‌రెడ్డి వార్షిక తనిఖీ చేశారు. అన్ని రికార్డులను మధ్యాహ్న భోజ నపథకం పరి శీలించారు. సంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఈఓలు ప్రతి తరగతిలో విద్యార్థులచేత పాఠ్యాంశాలను చదివించారు. విద్యార్థుల ప్రగతి సామార్థ్యాలను పరిశీలించారు. విద్యా ర్థులు ప్రతి రోజు స్నానం చేసి పాఠశాలకు రావాలనీ, పరిశుభ్రంగా వుండేవిధంగా వారిలో అవగాహన కల్పిం చాల్సిన బాధ్యత ఎంతైనా వుందనీ అన్నిసబ్‌సెక్టులు స్పీడ్‌గా చదివిం చాలనీ ఉపాధ్యాయులకు సూచించారు. కార్పోరేట్ పాఠశాలలకుదీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యా ర్థులు తయారు చేయవలసిన బాధ్యత మన అందరిపైన వుందన్నారు. విద్యా ర్థులు కూడా బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయా లన్నారు. సంక్రాంతి సెలవులలో సమయం వృధా చేయకుండా బాగా చదువుకోవాలనీ కెసి కెనాల్ కాలువల వెంట వెళ్లరాదన్నారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురా లు డి.రమణమ్మ, ఉపా ధ్యాయులు ఎన్.కవితా భాయి, ఎస్.బాల మద్దిలేటి, పి.నాగరాజు, కె.రామ కృష్ణ, ఐఈ ఆర్‌టిలు రామకృయ్య, జి.అరుణ కుమారి, ఎంఆర్‌సిలు పాల్గొన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆధ్వర్యంలో ఎంఈఓలకు ఉపాధ్యాయులు సన్మానం : ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.రమణమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారులు పి.సుభాన్, యర్రం మురళీమోహన్‌రెడ్డిలను దుశ్శాలువాలు కప్పి, పూలమాలలువేసి ఘనంగా సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది మధు, రామకృష్ణ, ఎర్రన్న పాల్గొన్నారు.



పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి..

: స్టడీ అవర్స్‌లను పరిశీలించిన కర్నూలు డైట్ కాలేజీ లెక్చరర్ గోవిందు..

కోసిగి, జనవరి 7, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న పదో తరగతి వందరోజుల కార్యచరణ ప్రణాళిలో భాగంగా నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను కర్నూలు జిల్లా డైట్ కళాశాల లెక్చరర్ గోవిందు పరిశీలించారు.. బుధవారం పాఠశాలలు అయిపోయిన తరువాత పదో తరగతి పిల్లలకు ఏర్పాటు చేస్తున్న స్టడీ అవర్‌ను కోసిగి ఎంఈవో బాలయ్యతో కలసి ఆయన రెండు జెడ్‌పి స్కూళ్లను తనిఖీ చేపట్టారు..ఈ సందర్భంగా పదో తరగతి పిల్లలకు నిర్వహిస్తున్న ఎఫ్ఎ-3 పరీక్షలను పరిశీలించారు.. అందరు శ్రద్ధతో చదువు కుంటున ్నట్లు తెలుసుకునా ్నరు.. జిల్లాలో కోసిగి మొత్తం వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంటుందన్నారు.. ఎక్కడ ఎలాంటి లోపం లేకుండా పిల్లలకు ఒత్తడి కలిగించకుండా, ఆందోళన చెందకుండా ఉండేలా చర్యలు తీసుకుని పదో తరగతి పరీక్షలకు పిల్లలను సిద్ధం చేయాలన్నారు..కోసిగి అంటేనే అక్షరాస్యతలో వెనుకబడిన ప్రాంతం అనే నానుడి తొలగి జిల్లాలోనే ప్రథమ స్థానం సంపాదించేలా విద్యార్థులను తయారు చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం. పరిమళదేవి, బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జీ రమేష్,ఖలీల్‌అహ్మద్, తదితరులు పాల్గొనా ్నరు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవు

మంత్రాలయం, జనవరి 07, ప్రభాతవార్త; మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ షఫీయుల్లాఖాన్, చాంద్‌బాషలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ మీటర్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే ప్రభుత్వం పెనాల్టీ విధిస్తుందన్నారు. విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌ను సొంతంగా వేసుకోరాదన్నారు. జంతువులను వేటాడేందుకు కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం నేరమన్నారు. విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ దయాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కంది పంట క్వింటానికి 8000 మద్దతు ధర

పత్తికొండ రూరల్, జనవరి 7, ప్రభాతవార్త : ఖరీఫ్ సీజన్లో వేసిన కంది పంటకు క్వింటా నికి ఎనిమిది వేల రూపాయల చొప్పున ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పత్తికొండ మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చందోలి, చక్రాల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం లో భాగంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కందులు కొనుగోలుకై సీఎం యాప్ నందు రైతు సేవా కేంద్రాల్లో కంది పంట రిజిస్ట్రేషన్ తప్పక చేసుకొని ఉండాలన్నారు. అలా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి నుండి మాత్రమే ప్రభుత్వం కందులు ఒక క్వింటా నికి 8000 రూపాయలు చొప్పున చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పండించిన కందులను సమీప ఆరెస్కే నందు కొనుగోలుకై మట్టి,రాళ్లు లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు కందులు కొనుగోలుకై 9652020028, 9848357637 నెంబర్లను సంప్రదించాలని రైతులను కోరారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చందోలి అగ్రికల్చర్ అసిస్టెంట్ క్రాంతి కుమార్, చక్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

భూసార పరీక్షకనుగుణంగానే ఎరువులు వాడాలి..!

: జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సునీతా..

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 07, ప్రభాతవార్త : భూసార పరీక్షకు అనుగుణంగానే ఎరువులు వాడాలని మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో రైతులకు భూసార పరీక్ష లపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారి సునీత తెలిపారు.బుధవారం ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు ఏవో శివశంకర్, ఏడి ఖాద్రి,సునీత లు మాట్లాడుతూ మండల పరిధిలోని దైవందిన్నే గ్రామంలో రైతులు కు భూసార పరీక్షకు అనుగుణంగానే రైతులు ఎరువులు వాడాలి, విచక్షణారహితంగా ఎరువులు వాడితే ఎక్కువగా చీడపీడలు,పెట్టుబడి ఎక్కువై తద్వారా దిగుబడి తగ్గుతుంది. కాబ్బటి పొలంలో రైతులు గట్ల మీద కాంగ్రెస్ గడ్డి/వయ్యారి భామ లేకుండా చూసుకోవాలి. లేదంటే దీనివల్ల పంటలకు వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది కాబట్టి పొలం గట్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. అలాగే ఏపీ ఎఫ్ ఆర్ కింద రైతులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రబీ సీజన్లో ప్రతి రైతు కూడా పంట నమోదు చేయించు కోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లు రామ నాయుడు, రసూల్ రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన మందులను అందిస్తాం

ప్యాపిలి, జనవరి 7, ప్రభాతవార్త : ప్రజలకు నాణ్యమైన మందులను అందిస్తామని ఆర్యవైశ్య సంఘం, వైసీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు రాజా మురళికృష్ణ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన అపోలో ఫార్మసిస్ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు మందులు అందుబాటులో ఉంటాయని, ప్రజలు కూడ నాణ్యతమైన మందులని వాడాలని కోరారు.. ఈ కార్యక్రమంలో అపోలో ఫార్మసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

ఘనంగా ఫాదర్ రాబిల్లర్ వర్ధంతి వేడుకలు

- ఆయన చేసిన సేవలు మరువలేనివి

ఆదోనిలీగల్, జనవరి 07, ప్రభాతవార్త; రోమన్ కతోలిక సంఘంలో ఆదోని రోమన్ కతోలిక అనాధాశ్రమ బోర్డింగ్‌లో చేసిన సేవలు మరువ రానివని సెయింట్ అంతోని అనాధాశ్రమ కరస్పాండెంట్, డైరెక్టర్ ఫాదర్ రెవరెండ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సహాయక గురువులు విన్సెంట్‌లు పేర్కొన్నారు. కీ.శే. ఫాదర్ రాబిల్లర్ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనాధాశ్రమ బోర్డింగ్ విద్యార్థుల కోసం ఫ్రాన్స్ దేశానికి చెందిన గురువు రాబిల్లర్ చేసిన సేవలు ఈ సమాజంలో మరువరానివ్వన్నారు. ఆయన అనాథల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని ఫాదర్ రెవరెండ్ ప్రవీణ్‌కుమార్ కొనియాడారు. పూర్వపు విద్యార్థులు అనాధాశ్రమానికి చెందినవారు హాజరై వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనాధాశ్రమ విద్యార్థులకు భోజన సదుపాయాలను ఏర్పాటు చేశరు. అంతేగాకుండా ఈ ఏడాది పదో తరగతి విద్యార్థుల కోసం ఉత్తీర్ణత శాతం పెరగాలన్న ఉద్దేశ్యంతోనే క్వశ్చన్ బ్యాంకు పుస్తకాలను ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. అనాధాశ్రమ విద్యార్థుల కోసం ఫాదర్ రాబిల్లర్ చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోటింగ్ పూర్వపు విద్యార్థులు, కన్యస్త్రీలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

ఆదోనిటౌన్, జనవరి 07, ప్రభాతవార్త; ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది చలికాలంలో ఎంతోమంది వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తామని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు, అధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి, శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. బుధవారం రైలే స్టేషన్, బస్టాండు, దేవాలయ ఆవరణాలు, రోడ్డు పక్కన ఉన్న స్థలాల్లో పడుకుని ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో విడతలో వృద్ధులైన మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. మూడో విడత సందర్భంగా దాదాపు 50 దుప్పట్లను వివేకానంద సేవా సంస్థ వారికి అందజేసినట్లు తెలిపారు. జనవరి 12న నిర్వహించే వివేకానంద జయంతి రోజున అర్హులైన వారికి ఈ దుప్పట్లు పంచుతారన్నారు. మూడో విడతలో కలిసి దాదాపు 200 దుప్పట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పలు సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. లయన్స్ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట సభ్యులు నీల మోహన్, సీనియర్ సభ్యులు రహీంబాషా, వివేకానంద సమితి సభ్యులు ప్రకాష్, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

12న దుర్గాభోగేశ్వరంలో తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు వేలంపాట

గడివేముల, జనవరి 07, ప్రభాతవార్త; మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రమల కొండల్లో వెలిసిన దక్షిణ కాశీ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీ భోగేశ్వర దేవస్థానం ఆవరణలో శివరాత్రి సందర్భంగా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుకు ఈనెల 12వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వేలం పాటలో కళింగర పండ్ల దుకాణాలు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్, చెరుకుల దుకాణాలు, సప్లయర్‌షాపు, డెకరేషన్‌షాపు ఏర్పాటుకు వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 12న శ్రీ దుర్గా భోగేశ్వర దేవస్థానం వద్దకు రావాలని ఆలయ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పదిలో విద్యార్థినీలు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి

- ఎంపీడీఓ జ్యోతి - కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఎంపీడీఓ

దేవనకొండ, జనవరి 07, ప్రభాతవార్త; పదిలో విద్యార్థినీలు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని దేవనకొండ ఎంపీడీఓ జ్యోతి సూచించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం దేవనకొండ కేజీబీవీ పాఠశాలను ఎంపీడీఓ సందర్శించారు. విద్యార్థినీలకు అందిస్తున్న ఆహారాన్ని పరీక్షించి, పదో తరగతి విద్యార్థినీలతో మాట్లాడారు. రాగిజావా, గుడ్లు ఆహారం తీసుకుని, టైమ్ లైన్ షెడ్యూల్ ప్రకారం బాగా చదువుకోవాలని సూచనలు చేశారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రఫీ ఉన్నారు.

క్లాట్‌లో ప్రతిభ చూపిన గోరుకల్లు అమ్మాయి యాపమాను బెస్త విజయలక్ష్మి

: ప్రముఖ జాతీయ లా యూనివర్సిటీలో సీటు కేటాయింపు..

కర్నూలు, జనవరి 07, ప్రభాతవార్త ప్రతినిధి : పాణ్యం మండలం గోరుకల్లు గ్రామానికి చెందిన యాపమాను బెస్త పెద్దస్వామి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె విజయలక్ష్మి కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2026 లో మంచి ర్యాంక్ సాధించి విశాఖపట్నం లోని దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ లో సీట్ పొందింది. తండ్రి పెద్దస్వామి నంద్యాల లో అడ్వకేట్ గా, తల్లి లక్ష్మీదేవి నంద్యాల లో వీఆర్వో గా పనిచేస్తున్నారు. విజయలక్ష్మి హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని ఎన్ టీ ఆర్ జూనియర్ కాలేజీ లో ఎమ్ ఈ సి చదువుతోంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో 500 కు 493 మార్కులు సాధించి కాలేజీ టాపర్ గా నిలిచింది. క్లాట్ పరీక్ష రాసి ఆల్ ఇండియా ర్యాంక్ 4808, ఆల్ ఇండియా ఓబీసీ ర్యాంక్ 699, ఆంధ్రప్రదేశ్ లో జనరల్ ర్యాంక్ 61, ఉమెన్ కేటగిరీ ర్యాంక్ 38 సాధించి నేషనల్ లా కాలేజీ లో సీట్ పొందింది.. ఇంటర్ లో మంచి మార్కులు సాధించడం తో పాటు క్లాట్ 2026 లో మంచి ర్యాంక్ రావడం తో విజయలక్ష్మీ ని నారా భువనేశ్వరి అభినందించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ లో అభినందిస్తూ పోస్ట్ చేశారు. క్లాట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించి విశాఖపట్నం నేషనల్ లా యూనివర్సిటీలో సీటు పొందడంతో గోరుకల్లు గ్రామస్తులు, నంద్యాల న్యాయవాదులు పలువురు అభినందించారు..

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

- కప్పట్రాళ్ల గ్రామంలో రూ.42 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు భూమిపూజ



దేవనకొండ, జనవరి 07, ప్రభాతవార్త; కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని, ఇందుకోసం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో రూ.42 లక్షలతో నిర్మించతలపెట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టీడీపీ దేవనకొండ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మల్లేపల్లి రంగడు, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆసుపత్రి పూర్తి అయిన వెంటనే ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామారావునాయుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఆకుల వీరేష్, రాజాసాహెబ్, డి.ఉచ్చీరప్ప, తెర్నెకల్ చిన్నవెంకప్ప, పరామల నాగేష్, చాంద్‌బాషా, బాలరంగడు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్లినికల్ అనుభవం పొందిన ఫార్మ్ డీ విద్యార్థులు



కర్నూలు విద్య, జనవరి 7, ప్రభాతవార్తః మదర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ మై క్యాంపు కర్నూలుకు చెందిన మెడికల్ కళాశాల కెఎంసిలో నిర్వహించిన క్లినికల్ ఇంటరాక్షన్ మరియు కమ్యూనికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ద్వారా ఫార్మ్ డీ విద్యార్థుల్లో క్లినికల్ నైపుణ్యాలు వృత్తిపరమైన సంబాషన సామార్థ్యం మరియు పరస్పర అభ్యాసంను పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఇలాంటి క్లినికల్ కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు మరియు సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చేస్తాయని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన కర్నూలు మెడికల్ కళాశాల యాజమాన్యం, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు మైపర్ యాజమాన్యం అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగాది నాటికి.. ఇళ్ళ నిర్మాణాలు పూర్తిచేయాలి

– నెలవారి ప్రణాళికతో లక్ష్యసాధనకు కృషిచేయాలి
– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జనవరి 7, ప్రభాతవార్త ప్రతినిధిః
ఉగాది నాటికి జిల్లాలో చేపట్టిన ఇళ్ళనిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసి లబ్దిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి హౌసింగ్ అధికారులను అదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని విడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ డిఈలు, ఏఈలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో హౌసింగ్ పీడీ హరిగోపాల్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్ళనిర్మాణాలను పూర్తిచేసి లబ్దిదారులకు అందజేయాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఈలక్ష్యసాధనలో భాగంగా జిల్లాకు కేటాయించిన 14,868 ఇళ్ళ నిర్మాణాలను నియోజకవర్గాల వారిగా స్పష్టమైన లక్ష్యాలతో వేగవంతంగా పూర్తిచేయాల

న్నారు. జిల్లాలో ప్రస్తుతం రూఫ్‌స్థాయిలో ఉన్న 1,583 ఇళ్లు, లెంటల్‌స్థాయిలో న్న 2.085 ఇళ్లు, బేస్‌మెంట్‌స్థాయిలో ఉన్న 6.880 ఇళ్ళ నిర్మాణాలను తక్షణమే పూర్తిచేసేలా హౌసింగ్ ఇంజనీర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే పిఎం జన్మన్ పథకం కింద వివిద దశల్లో ఉన్న 556 ఇళ్ళ నిర్మాణాలను కూడ నిర్ధేశిత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. జిల్లాలో నెలవారి ప్రణాళికలు రూపొందించి పూర్తిచేయాల్సిన ఇళ్ళ వివరాలను ఇంజనీరింగ్ అసిసె ్టంట్‌లు, ఏఈలు, డీఈలకు స్పష్టంగా అందజేసి నిరంతర పర్యవేక్షన చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఉయ్యలవాడ, కోవెలకుంట్ల, గడివేముల మండలాల్లో ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కూడ పూర్తికాలేదని పేర్కొంటు జిల్లా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే లబ్దిదారులకు హౌసింగ్ 2.0 (పిఎంఏవై–యు2.0) పథకం ద్వారా పట్టణ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు రూ.2.50 లక్షల వరకు ఆర్థికసాయం అందజేస్తున్న విషయాన్ని లబ్దిదారులకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా సానుకూల దృక్పదంతో పనిచేస్తు ముఖ్యంగా రూఫ్‌స్థాయిలో నిలిచిపోయిన ఇళ్ళ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హౌసింగ్ అధికారులను అదేశించారు.

రెవెన్యూ సమస్యలు.. పరిష్కరించండి

: రెవెన్యూ క్లినిక్‌లు, స్పెషల్ క్యాంపుల అర్జీలపై ప్రత్యేక దృష్టి
: రీ-సర్వే, వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్, ఇనాం-చుక్కల భూములపై సమీక్ష
: ఐవీఆర్ఎస్ ఫిర్యాదులు రాకూడదు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష

కర్నూలు, జనవరి 07, ప్రభాతవార్త :
రెవెన్యూ క్లినిక్‌లు, స్పెషల్ క్యాంపుల ద్వారా వచ్చిన అర్జీలు సహా ఇతర అన్ని రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం పత్తికొండ డివిజన్ పరిధిలో రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం, ఇనాం పట్టాలు, చుక్కల భూములు, రీ–సర్వే ప్రక్రియ తదితర అంశాలపై తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వారం ఒక డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌లు, స్పెషల్ క్యాంపుల అర్జీలు, రీ–సర్వే, వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్, ఇనాం భూములు, చుక్కల భూములు, నిషేధిత జాబితా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక నెలలోపు అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం మాత్రమే పరిష్కారాలు చేపట్టాలని స్పష్టం చేశారు. రీ–సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని, తప్పులు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని, మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రీ–సర్వే పూర్తైన గ్రామాల్లో తుది డిఎల్ఆర్ (స్ట్రీ దీలిళి) ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, లోపాలకు తావు లేకుండా పూర్తిచేయాలని సూచించారు. చిన్నపాటి తప్పిదాల వల్ల కూడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రతి దశను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఇనాం, చుక్కల భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఇనాం, నిషేధిత జాబితా, రీ–సర్వే తదితర రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలను అధికారులు సమగ్రంగా పరిశీలించారు. పత్తికొండలో డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ ద్వారా 150 ముస్తాబు కిట్లు పంపిణి

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జనవరి 7, ప్రభాతవార్త ప్రతినిధిః
సంక్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టితో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 150 ముస్తాబు కిట్లును పంపిణి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ అవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ వేల్ఫేర్ బీసీ హాస్టల్ విద్యార్థులకు అందజేయాల్సిన ముస్తాబు కిట్లను సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గోవిందనాయక్, సాంఘీక సంక్షేమ అధికారి చింతామణి పాల్గొన్నారు. ఈసందర ్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్తాబు కిట్ల ద్వారా విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందన్నారు. చిన్నవయసులోనే పరిశుభ్రత అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ప్రతిహాస్టల్ తరగతి గదిలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేసి అద్దం, దువ్వెన, నెయిల్ కట్టర్, హ్యాండ్‌వాష్, శానిటైజర్ వంటి అవసరమైన వస్తువులు అందుబాటులో ఉంచాలని సంక్షేమ అధికారులను అదేశించారు. పరిశుభ్రత పాటించే విద్యార్థులను పరిశు భ్రత నాయకులుగా నియమించి చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత అలవాట్లను పర్యవేక్షించే బాధ్యత అప్పగించాలన్నారు. ఈకార్యక్రమాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సంబంధిత అధికారులకు అదేశాలు జారీచేశారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన.. వెంకటరామిరెడ్డికి ఘన నివాళ్లు

: భారతీయ జనతా పార్టీ అంటే క్రమశిక్షణకు మారుపేరు...
: బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా

ఆత్మకూరు జనవరి 7 ప్రభాతవార్త :
మండల పరిధిలోని శ్రీపతి రావు పేట గ్రామానికి చెందిన బిజెపి మండల అధ్యక్షుడు గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెన్న వెంకటరామి రెడ్డి చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా,అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కోసం పని చేస్తూ ఆ కాలంగా రోడ్డు ప్రమాదంలో మరణించిన వెంకట్రాంరెడ్డి మన మధ్యలో లేకపోవడం చానా బాధాకరమైన విషయమని అతని కుటుంబాన్ని భారతీయ జనతా పార్టీ తరఫున ఆదుకుంటామని అన్నారు. ఈ విధంగా భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణకు మారుపేరని నిత్యం ప్రజల సమస్యల కోసం పాటుపడే పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీ మాత్రమే అని పార్టీ వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకుంటామనిఅన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 2026 జనవరి నెల నుండి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జనతా వారధి అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఈ కార్యక్రమన్ని జిల్లాలోని బిజెపి కార్యాలయం మరియు కలెక్టరేట్ సమీపంలో నిర్వహించడం జరుగుతుందని తద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వాలకు వారధిగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ పరిష్కార వేదికలో నలుగురు సభ్యులతో ఓ కమిటీగా ఏర్పడి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి మహిళా నాయకురాలు నాయకులు పాల్గొన్నారు.

గ్రామంలో ప్రజలంతా.. సుఖసంతోషాలతో ఉండాలి

: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ.

ఆదోని డిసెంబర్ 07 ప్రభాతవార్త :
గ్రామంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని బంగారం అవ్వను మొక్కుకున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా ఇన్చార్జి గుడిసె కృష్ణమన్నారు. బుధవారం మండల పరిధిలోని జాలమంచి గ్రామంలో జరిగిన దేవరలో బంగారమ్మ పెద్దమ్మవ్వను సుంకులమ్మ దేవర సందర్భంగా అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు శ్రీశైల మహానంది గోవిందు బంగారన్న హుసేని బంగారుబాబు ఎస్సీ ఎంపిటిసి మురళి ఎస్సీ సర్పంచ్ మాధవ రామచంద్రా వేణుగోపాల్ రెడ్డి బుద్ధారెడ్డి సాదిక్ వలి భాస్కర్ చంద్ర కల్లుబావి మల్లీ తదితరులు పాల్గొన్నారు

రాయలసీమలో తొలిసారిగా టి ఓ టి శస్త్రచికిత్స విజయవంతం

కర్నూలు హాస్పటల్ జనవరి 7 ప్రభాతవార్త
మహిళల్లో సాధారణంగా కనిపించే స్ట్రెస్ యూరిన్ ఇన్‌కాంటినెన్స్ సమస్యకు ఆధునిక పరిష్కారంగా నిలిచే ట్రాన్స్ ఒబ్ట్యూరేటర్ టేప్ (టి ఓ టి) శస్త్రచికిత్సను రాయలసీమలో తొలిసారిగా మెడికవర్ హాస్పిటల్స్, కర్నూలులో విజయవంతంగా నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా ఈ సమస్యతో బాధపడుతున్న 44 ఏళ్ల మహిళకు కన్సల్టెంట్ యూరోగైనకాలజిస్ట్ డా. శిల్పా చౌదరి పర్యవేక్షణలో శస్త్రచికిత్స చేయగా, మూత్ర లీకేజ్ పూర్తిగా తగ్గి ఆమె సాధారణ జీవితానికి తిరిగి చేరుకున్నారు. ఈ మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్సకు సుమారు 90 శాతం వరకు విజయశాతం ఉండగా, రోగులు త్వరగా కోలుకొని అదే రోజు ఇంటికి వెళ్లగలుగుతారని వైద్యులు తెలిపారు. ఈ చికిత్స ద్వారా మహిళలు మూత్ర లీకేజ్ భయం లేకుండా జీవించగలరని పేర్కొన్నారు.

బనగానపల్లెలో భక్తి శ్రద్ధలతో.. మోలాలి ఉర్సు ఉత్సవాలు

: హిందూ..ముస్లిం సోదరుల మొక్కులతో కిటకిటలాడిన మోలాపహాడ్

బనగానపల్లె జనవరి 7 ప్రభాతవార్త :
పట్టణంలోని రవ్వలకొండపై నవాబుల కాలంలో వెలసిన మోలాలి దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ముగిసాయి. హాజరత్ మోలాలి జన్మదినాన్ని పురస్కరించుకుని 3 వ తేదీన స్థానిక ఆస్థానం నుంచి నవాబ్ వంశీకులు జండా తీసుకుని మోలాపహాడ్ రావడంతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధాన ఘట్టమై నమంగళవారం గంధం, బుధవారం ఉర్సు ఉత్సవాలకు పెద్ద ఎత్తున హిందు,ముస్లిం సోదరులు హాజరై మోలాలి స్వామికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బనగానపల్లె సంస్థానాన్ని పాలించిన షియా నవాబుల ఏలుబడిలో వెలసిన ఈ దర్గా ఇప్పటికి వారి వంశీయుల అధీనంలోనే ఉంది. ప్రతి ఏటా రజబ్ నెలలో 13 వరోజున జయంతి 16,17 వ రోజుల్లో ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు. హాజరత్ మోలాలి దర్గాలోని హాజ్రత్ అలీ(పంజాబాబా)ని దర్శించుకోవడానికి అనునిత్యం వివిధ ప్రాంతాల నుండి భక్తులు వస్తుంటారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే ఈ దర్గాలోని పంజాబాబాను దర్శించుకుంటే తాము కోరిన కోరికలు నెర వేరుతాయని ఇక్కడికి వచ్చే భక్తుల అపార నమ్మకం. ప్రతి యేటా హాజ్రత్ అలీ జన్మదినం పురస్కరించుకొని నిర్వహించే ఉర్సు ఉత్సవాలు ఇక్కడ ప్రత్యేకతను సంతరించుకుందని చెప్పవచ్చు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని మోలాలి దర్గాకు ప్రత్యేకంగా రంగులు వేసి , ప్రతి కమాన్(స్వాగత చిహ్నం) కు రంగురంగుల విద్యుత్ దీపాలు అలంకరించి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా రాత్రి వేళలో మోలాలి పహాడ్ , మోలాలి కమాన్ రంగు రంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా కనిపించి భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

ఎమ్మిగనూరు ను జిల్లా గా ప్రకటించాలి

: జేఏసీ నాయకులు రాజేష్ రంగయ్య

ఎమ్మిగనూరు రూరల్ జనవరి 07 ప్రభాతవార్త :
ఎమ్మిగనూరు ను జిల్లాగా ప్రకటించాలని సోమప్ప సర్కిల్ నందు విద్యార్థి,యువజన,ప్రజాసంఘాల జేఏసీ నాయకులు రాజేష్, రంగయ్య ఆధ్వర్యంలో నాల్గవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరిగింది. బుధవారం ఈ దీక్షలకు మద్దతుగా రాష్ట్ర ఎరుకుల సేవ సంఘం జాయింట్ సెక్రెటరీ సూర్యనారాయణ దీక్షా శిబిరంలో ఉన్న వారికి పూలదండలు వేసి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మిగనూరు జిల్లాగా ప్రకటిస్తే ఐదు నియోజకవర్గాలు, పశ్చిమ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోతాయని ఇక్కడ విశాలమైన భూమి,వాటరు, కలెక్టర్ కార్యాలయాలకు, ఎస్పీ కార్యాలయాలకు, భూమి అన్ని వసతులు కు అనువుగా ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, చార్లెస్, చిన్న, ప్రసాద్ ఎరుకల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా 16 రకాల రక్త పరీక్షలు

: ఆర్డిఓ నరసింహులు

డోన్ జనవరి 7 ప్రభాతవార్త :
డోన్ పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న క్లబ్ హౌస్ నందు డోన్ పట్టణంలో నివసిస్తున్నటువంటి 20 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల ఉన్న మహిళలకు దాదాపు 16 రకాల జబ్బులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించడం సంతోషకరమని ఆర్డిఓ నరసింహులు మున్సిపల్ కమిషనర్ ఎస్ ప్రసాద్ గౌడ్ లో అన్నారు. 6, 7, తేదీలలో దాదాపు 1000 మంది దాకా మహిళలు రక్త పరీక్షలు చేసుకున్నారని రక్త పరీక్షలు చేసుకున్న వారిలో ఏదైనా సమస్య ఉన్నప్పటికీ వాటి ద్వారా డాక్టర్లు సంప్రదించి జబ్బులను నయం చేసుకోవచ్చని పేర్కొన్నారు అదేవిధంగా సెంట్రల్ గవర్నమెంట్ నుండి కూడా ఐదు లక్షలు బీమా కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్ ఆర్ఎంపీ డాక్టర్లు కొచ్చేరువు వెంకటేశు మహమ్మద్ రఫీ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన.. వైకాపా నాయకులు

– బాధితులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి,జనవరి7,ప్రభాతవార్త :
ఏపి మాజీ ముఖ్యమంత్రి,వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి,బొమ్మిరెడ్డి పల్లి గ్రామ వైకాపా నాయకులతో కలిసి తాడేపల్లి వైకాపా పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కర్నూలు జిల్లా,వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో నెలకొన్న పరిస్థితులను ఆ గ్రామ నాయకులతో కలిసి మాజీ సిఎంకు ఆమె వివరించారు.ఆ గ్రామ వైకాపా నాయకులు,మాజీ ఎమ్మెల్యే శ్రీదేవితో కలిసి మాట్లాడుతూ తాము 19 నెలలుగా గ్రామంలో తమ పొలాల్లో పంటలు వేసుకుంటుంటే అడ్డుకుంటూ వ్యవసాయ భూములను బీడుభూములుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ సిఎంకు వివరించారు.ఈ చర్యలతో రైతులు,తమ పార్టీ నాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఆర్థికంగా నష్టపోయి, జీవనోపాధి కొల్పోయే స్థితికి చేరుకున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఆ గ్రామంలో వైకాపా సానుభూతిపరుల గడ్డివాములను దగ్ధం చేసిన ఘటనలు జరుగుతున్నాయన్నారు.రైతులకు కోర్టు నుంచి ఉత్తర్వులు ఉన్నాయని అయితే రైతులను పొలాలకు వెళ్లనీయకపోవడం దురా ్యర్గమన్నారు. బాధితులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని,పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. అనంతరం వైకాపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సజ్జల రామక్రిష్ణారెడ్డిని కలిసి వారు తమ సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మధుసూధన్‌రెడ్డి,చక్రపాణిరెడ్డి,ఆనందపద్మనాధరెడ్డి,భాస్కర్‌రెడ్డి,వెంకటేశ్వరరెడ్డి,రంగయ్యచౌదరి,జగదీశ్వరరెడ్డి,సూర్యనారాయణచౌదరి,వెంకటేష్ చూదరి, సంజీవ రెడ్డి , భాస్కర్‌నాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ డా.బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో ఈనెల 9న మెగా జాబ్‌మేళా

నంద్యాల, జనవరి 7, ప్రభాతవార్త ప్రతినిధిః
నంద్యాల జిల్లా నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, లోక్‌సభ డిప్యూటి ఫ్లోర్ లీడర్ డా.బైరెడ్డి శబరి భారీ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వికాస శిక్షణ ప్లేస్మెంట్ సంస్థల సహకారంతో ఈనెల 9న శుక్రబారం నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో ఉన్న శ్రీరామకృష్ణ పీజీ కళాశాల అవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈజాబ్ మేళాలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన టెక్ మహింద్రా, టాటా ఎలక్ట్రానిక్స్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ప్రిమియర్ ఎనర్జీస్ వంటి దిగ్గజ సంస్థలు పాల్గొంటాయని మొత్తం 800 ఖాళీలను ఈ మెగా జాబ్ మేళా వేదిక ద్వారా భర్తీచేయ నున్నట్లు ఎంపీ తెలిపారు. పార్లమెంటులోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కోరారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల.. జాగ్రత్త

: విద్యుత్ వాడకంపై పలువురికి అవగాహన

కోసిగి, జనవరి 7, ప్రభాతవార్త :
విద్యుత్‌ను వాడుకునే సమయంలో జరిగే ప్రమాదాలను నివారించే ముందే విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా మెలగాలని విద్యుత్‌విజిలెన్సు హెడ్ కానిస్టేబుల్ సఫీవుల్లా ఖాన్, విజిలెన్సు పోలీసు చాంద్‌బాషాలు తెలిపారు.. బుధవారం కోసిగి మండల పరిదిలోని కందుకూరు గ్రామంలో విద్యుత్ వాడకంపై పలువురికి అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను వాడుకోవాలనుకునే వారు తప్పని సరిగా మీటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్‌ను దొంగతనంగా వాడడం సరికాదన్నారు.. విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే వారిపై భారీ జరిమానాలు ఉంటాయ న్నారు..అంతేకాక రాత్రిపూట జంతువు లను వేటాడేవారు తాము వాడే ఉచ్చులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదని రైతుల పొలాల్లో ఉండే ట్రాన్స్‌ఫార్మర్ లకు స్వంతంగా ఫ్యూజ్ లను వేసుకోరాదని సూచించారు.. ఇళ్లపై ఉంటున్న విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తలు వహించాలని, పిల్లలు

ఆడుకునే పరికరాలను జాగ్రత్తగా ఉంచాలన్నారు.. ఇంట్లో హీటర్ వాడే సమయంలో స్విచ్ఛాఫ్ చేయకుండా నీటిని తాకరాదని తెలిపారు..ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రాజశేఖర్, మిన్నప్ప, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.. అనంతరం విద్యుత్ ప్రమాదాలకు సంబందించి వాల్ పోస్టర్లను గోడలకు అతికించారు..

కెసికెనాల్‌లో యువకుడు గల్లంతు

పాములపాడు, జనవరి 7, ప్రభాతవార్తః
పాములపాడు మండలం కోల్స్ ఆనందాపురం గ్రామానికి వంశీ (22) కెసి కెనాల్‌లో గల్లంతు అయిన సంఘటన మంగళవారం రాత్రిచోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు కోల్స్ ఆనందపురం చెందిన వంశీ మంగళశారం రాత్రి కెసికెనాల్‌లో దూకేటప్పుడు చూసిన వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. పాములపాడు ఎస్ఐ తిరుపాలు సంఘటన స్థలానికి చేరుకొని గాలింపుచర్యలు చేపట్టారు. బుధవారం అంతా గాలింపు చేసినప్పటికి వంశీ అసూకీ లేదు. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.